క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ అందజేత



చెక్కును అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండకు చెందిన మహేశ్వరికి మంజూరైన రూ. 39 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు మంచ శ్రీరామ్ అందజేశారు.కార్యక్రమంలో నాయకులు నర్సింలు, బి.నర్సింలు, ప్రవీణ్ సింగ్, భగవాన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం



ర్యాలీ తీస్తున్న గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ లింగమణి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శివాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై మహిళలకు వివరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

మనోహరాబాద్(తూప్రాన్): రుణమాఫీ చేసినందుకు మండలంలోని పాలాట రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రమేష్ మాట్లాడుతూ.. రుణమాఫీ చేసి కాంగ్రెస్ రైతులకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సందడిగా స్నేహితుల దినోత్సవం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులంతా కలిసి ఒకరికొకరు కంకణం కట్టుకున్నారు. లయన్స్ జిల్లా చైర్‌పర్సన్ లింగమూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంచంద్రం, సతీశ్, నాగరాజు, వీరబ్రహ్మం, నర్సింహులు, మనోహర్, బోగరాజు, సూర్యప్రకాశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవం



పోచమ్మకు భోనాలు సమర్పిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో ఆదివారం వనభోజన మహోత్సవం నిర్వహించారు. ప్రతియేటా లాగానే ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దచెరువు మత్తడి దగ్గర కొలువైన పోచమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వనభోజనాలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం అందించే సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌కు చెందిన పలువురికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల సహకారంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 3,01,550 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్, నిజాముద్దీన్, సత్యగౌడ్, స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి 'పేట' మండలం

సంగారెడ్డి జిల్లాలో కలపాలని అసెంబ్లీలో చర్చ



పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నో ఏళ్లుగా పెద్దశంకరంపేట మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. అప్పట్లో కొత్త జిల్లాగా మెదక్ ఏర్పాటు కావడం.. మండలాల సంఖ్య తక్కువగా ఉండడంతో పేట మండలాన్ని జిల్లాలోనే కొనసాగించారు. దీంతో మండల వాసులు జిల్లా కేంద్రమైన మెదక్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రస్తుత ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమస్యను వివరించి సంగారెడ్డి జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పెద్దశంకరంపేట మండలాన్ని మెదక్ నుంచి సంగారెడ్డి జిల్లాలో కలపాలని సభ దృష్టికి తీసుకొచ్చారు.

సంగారెడ్డితోనే సంబంధాలు ఎక్కువ

పెద్దశంకరంపేట మండలం నుంచి 161వ జాతీయ రహదారి వెళ్లడంతో సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కేవలం గంట సమయంలో వెళ్లేందుకు ఆస్కారం ఏర్పడింది. ఇక్కడి ప్రజలు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నివసిస్తుంటారు. హైదరాబాద్‌తో పాటు పెద్ద ఆసుపత్రులకు వెళ్లాలంటే దగ్గరగా ఉంటుంది. కానీ ప్రస్తుతం మండలం నుంచి మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 45 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. అది కూడా గుంతలు తేలిన నార్సింగి రహదారిపై వెళ్లాలంటే నరకయాతన పడాల్సిన దుస్థితి నెలకొంది. బస్సు సదుపాయం లేకపోవడం, రహదారులు సరిగా లేకపోవడం ఇక్కడి ప్రజలకు ఇబ్బందిగా మారింది.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



పెద్దశంకరంపేట మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జిల్లా ఆసుపత్రులతో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గంలో అన్ని కార్యాలయాలు దగ్గరలో ఉన్నాయి. మెదక్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలి.

– జోడు రవీందర్, పెద్దశంకరంపేట

ఖేడ్‌లోనే సౌకర్యాలు



పెద్దశంకరంపేట మండలానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంలో అనేక రకాల సౌకర్యాలు, ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 45 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి బస్సు సదుపాయం సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– చందుపట్ల అరుణ్, పెద్దశంకరంపేట

జిల్లాలో ఒకే మండలం..!

నారాయణఖేడ్ నియోజకవర్గంలో కేవలం పెద్దశంకరంపేట మండలం మాత్రమే మెదక్ జిల్లాలో ఉంది. ఆర్డీఓ, కలెక్టరేట్, కోర్టులు, ఎస్పీ కార్యాలయం, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్‌తో పాటు జిల్లా ఆస్పత్రి, వివిధ కార్యాలయాలకు మెదక్‌కు వెళ్లేందుకు ఈ ప్రాంత వాసులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణఖేడ్‌లో అన్ని కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఎటు చూసిన పెద్దశంకరంపేట మండలం సంగారెడ్డి జిల్లాకు అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి పెద్దశంకరంపేట మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎమ్మార్పీఎస్ సంబరాలు

కౌడిపల్లి(నర్సాపూర్): సుప్రీంకోర్టు తీర్పుతో సుదీర్ఘ పోరాటం ఫలించిందని, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు జరగనుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాదిగ తెలిపారు. ఆదివారం కౌడిపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సుప్రీం తీర్పుతో ఏబీసీడీ వర్గీకరణ జరిగి మాదిగ, మాదిగ ఉపకులాలకు మంచిరోజులు వస్తాయన్నారు. ఉద్యోగాలలో రిజర్వేషన్లు దక్కనున్నాయని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను త్వరగా చేపట్టాలన్నారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లు సైతం ఎస్సీ వర్గీకరణ చేసిన అనంతరం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, ఉపాధ్యక్షులు రమేశ్, మల్లేశ్, మండల నాయకులు కృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, ఆంజనేయులు, సామేల్, వినోద్, ప్రభాకర్, సుధాకర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో బిల్లు పెట్టాల్సిందే

మిరుదొడ్డి(దుబ్బాక): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టాలని అసైన్డ్ భూ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైండ్ల నందు డిమాండ్ చేశారు. ఆదివారం చెప్యాల క్రాస్ రోడ్డులో ఆయన మాట్లాడుతూ, గత ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. అసైన్డ్ భూముల చట్టం 1977ను రద్దు చేసి కొత్త బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక దృష్టి సారించి, బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ప్రతిపాదించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సన్న, చిన్న కారు రైతులు మాచపురం యాదగిరి, బోడెల్లి ఎల్లయ్య, నర్సింహులు, సత్తయ్య, రవి, యాదగిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



టేక్మాల్(మెదక్): సమావేశంలో పూర్వ విద్యార్థులు



పాపన్నపేట(మెదక్): 1992-93 బ్యాచ్ విద్యార్థులు



వెల్దుర్తి(తూప్రాన్): ఆత్మీయ సమ్మేళనంలో..



చిన్నశంకరంపేట(మెదక్): జెడ్పీపాఠశాలలో..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా కొనసాగింది. 1992–93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిరపడి 31 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు కోటయ్య, మహేందర్ రెడ్డి, బిచ్చయ్య, బీ.జనార్దన్, కే.జనార్దన్, సుదర్శన్, ప్రభాకర్, పూర్వ విద్యార్థులు చీనూరి కుమార్, రమేశ్, భట్టు శ్రీధర్ రాజు, మున్వర్, ప్రసాద్, శేష శైనారెడ్డి, సత్యనారాయణ, క్రిష్ణమూర్తి, సాయిబాబు, శోభారాణి, మంజుల, మమత, సంతోష కుమారి, లావణ్య, రూప, తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): టేక్మాల్ ఉన్నత పాఠశాలలో చదివిన పదో తరగతి 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవ సందర్భంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారికి బోధించిన ఉపాధ్యాయులైన సుధాకర్, శంకర్‌లతో పాటూ ఇతరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండ రమేశ్, హీరాలాల్, బాల్‌రాజ్, మల్లేశం, విజయలక్ష్మీ, నాగలక్ష్మీ, జ్యోతి, సంధ్య, అమీర్, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాల 1987–88 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతల కరుణాకర్ రెడ్డి, రామగౌడ్ నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాల 2006–07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు రాములు, బాలేశ్ గౌడ్, జాన్‌వెస్లీ, నర్సింగరావు, దుర్గారెడ్డి, అంజయ్య, దేవిసింగ్, దేవరాజ్, వసుంధర, దేవి, ఆదిలక్ష్మి, అరుణలను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **రిలే నిరాహార దీక్షలు**

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింతకుంట భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 24 రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీపీఎం లోక్ సత్తా నాయకులు నాగరాజు, చంద్రశేఖర్, నరేందర్ మద్దతు తెలిపారు. భూమికి భూమి లేదా ఎకరాకు 60 లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో మహేశ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, పోచయ్య, రామకష్ణ, ప్రేమ్ చరణ్, నారాయణ, చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **చాముండేశ్వరి అమ్మవారికి పూజలు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలిసిన అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

◆ **నేటి నుంచి స్వచ్ఛదనం కార్యక్రమాలు**

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, గ్రామకార్యదర్శులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

◆ **అన్నదానం**

రేగోడ్(మెదక్): మండలంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గోకర్ణేశ్వర శివాలయంలో పూజారి మహేశ్ అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. అనంతరం చిదిరె కృష్ణ కుటుంబీకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ **మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం**

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని ఆర్ వెంకటాపూర్‌లో నిరుపేద రాజపల్లి రాజమ్మ మృతి చెందగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెంకుగారి రాజిరెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేదలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన తెలిపారు.

◆ **విరాళాల సేకరణ**

సిద్దిపేటఅర్బన్: కేరళలోని వాయనాడ్ బాధితుల కోసం సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో విరాళాల సేకరణ చేపట్టారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బాధితులకు చేయూతగా నిలిచేందుకు నిధి సేకరిస్తున్నట్టు ఆయన తెలిపారు. సేకరించిన నిధిని వరద బాధితులకు అందిస్తామన్నారు.

వెలగని వీధిలైట్లు



అంధకారంలో ధనలక్ష్మి కాలనీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పెద్ద చెరువు కట్టపై నుంచి వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుండడంతో రాత్రి వేళలో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ, విద్యుత్‌శాఖల సమన్వయం లోపంతోనే వీధి లైట్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి రమాదేవిని వివరణ కోరగా.. వీధిలైట్లు వేసేందుకు విద్యుత్‌శాఖ ఎల్‌సీ ఇవ్వకపోవడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పలుచోట్ల విద్యుత్ లైన్ మరమ్మతుల గురించి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ ఏఈ దుర్గప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. స్థానిక ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసుకొని వీధి లైట్లు వెసుకోవచ్చునని చెప్పారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

త్వరలోనే ఎమ్మెల్యేతో సమావేశం



మాట్లాడుతున్న నరేష్‌గౌడ్

మెదక్ కలెక్టరేట్: జర్నలిస్టుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో మెదక్ ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, రాని వారికి ఇళ్ల స్థలాలు త్వరలోనే ఇప్పిస్తామన్నారు. ఎప్పటికప్పుడు జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్నామని, ఆయన సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ భవనానికి మరిన్ని నిధులు కావాల్సి ఉందని, నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానన్నారు. త్వరలోనే ఎమ్మెల్యేను ప్రెస్‌క్లబ్ పక్షాన కలిసి సమస్యలు వివరిద్దామన్నారు. ఈసందర్భంగా ప్రెస్‌క్లబ్‌లోని సభ్యులకు సభ్యత్వం రెన్యువల్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు కామాటి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

● ఫలాంబరీదేవిగా దర్శనం



కౌడిపల్లి: ఫలాంబరీదేవిగా తునికి శ్రీనల్లపోచమ్మదేవి దర్శనం.

కౌడిపల్లి(నర్సాపూర్): ఫలాంబరీదేవిగా తునికి శ్రీనల్లపోచమ్మదేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా ఉదయం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పండ్లతో ఫలాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలంకరణకు ఎంపీటీసీ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ ఎల్లం పండ్లను సమకూర్చారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేయించారు. బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద డప్పు చప్పుడు శివసత్తుల పూనకాలు అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దీంతోపాటు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

● విశిష్ట పూజలు



ప్రత్యేక అలంకరణలో బగలాముఖీ



బగలాముఖీ శక్తిపీఠంలో భక్తజనం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం విశిష్ట పూజ కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిద్వార్చన, విశేష పూజలు, హోమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దివంగత అంజాగౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారులు భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ భూదాత పబ్బ రమేశ్‌గుప్తా, నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్, కొండల్, సుదర్శన్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, పోచగౌడ్, వెంకటేశ్, నర్సింహులు, ఆలయ అర్చకులు సంతోశ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

గుంత.. వాహనదారులకు చింత



జాతీయ రహదారి సమీపంలో ఏర్పడిన భారీ గుంత

కొల్చారం(నర్సాపూర్): అది మెదక్– బాలానగర్ జాతీయ రహదారి. సంగారెడ్డి జోగిపేట వైపు నుంచి వచ్చే వాహనాలు పోతంశెట్టిపల్లి చౌరస్తా వద్ద ఈ రహదారిపైకి ఎక్కి అటు బాలానగర్.. ఇటు హైదరాబాద్ వెళ్తుంటాయి. అక్కడే కమాన్ను అనుకొని పెద్దపాటి గుంత ఏర్పడింది. వర్షం నీరు వచ్చి చేరడంతో అది కాస్త ప్రమాదకరంగా మారింది. వాహనదారులు జాతీయ రహదారిపైకి చేరేందుకు, దిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ సమయంలో మరమ్మతులు చేయకుండా వదిలేశారు. పంచాయతీ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.